## క్లుప్తంగా

### ఎస్సీ వర్గీకరణ జేఏసీ జిల్లా చైర్మన్‌గా రమణ

కొవ్వూరు: ఎస్సీ వర్గీకరణ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) జిల్లా అధ్యక్షుడిగా స్థానిక ఔరంగాబాద్‌కు చెందిన కొడమంచిలి రమణ నియమితులయ్యారు.ఈ మేరకు రాష్ట్ర చైర్మన్ మామిడి సుదర్శన్ నుంచి సోమవారం ఆదేశాలు అందాయని ఆయన తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఎస్సీ వర్గీకరణకు కృషి చేయాలని ఆయన కోరారన్నారు. జిల్లా, మండల,ని యోజవర్గ స్థాయిలో ఎస్సీ వర్గీకరణపై జాయింట్ యాక్షన్ కమిటీలను నియమించాలని ఆదేశించినట్టు రమణ తెలిపారు.

### విజయవాడకు కొత్త బస్సు సర్వీసు



జెండా ఊపి బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు: కొత్తగా విజయవాడ–కొవ్వూరు మధ్య ఏర్పాటు చేస్తున్న ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీసును ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా సోమవారం ప్రారంభించారు. ఈ బస్సు రోజూ ఉదయం ఆరున్నర గంటలకు, తిరిగి మధ్యాహ్నం ఒంటి గంటకు కొవ్వూరు డిపో నుంచి బయల్దేరుతుందని డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణ, ఇతర సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

పెరవలి: మండలంలోని కాపవరం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమకు ఇష్టమైన మిల్లులకు ధాన్యాన్ని అమ్ముకోవచ్చన్నారు. అంతేగాకుండా వారం రోజుల లోగానే ధాన్యం సొమ్ములు రైతుల ఖాతాల్లోకి జమ అయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.అచ్యుత కుమారి, మండల వ్యవసాయాధికారి మేరీ కిరణ్, జనసేన పార్టీ మండలశాఖ అధ్యక్షుడు పిప్పర రవి, టీడీపీ మండల శాఖ అధ్యక్షులు అతికాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### వేగేశ్వరపురంలో అయ్యప్ప పడిపూజ

తాళ్లపూడి: వేగేశ్వరపురంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఆదివారం రాత్రి అయ్యప్పస్వామి పడి పూజ వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప మాలధారుల శరణు ఘోషతో, అయ్యప్ప గీతాలతో ఆ ప్రాంతమంతా మారుమోగింది. గురుస్వామి చింతపల్లి రెడ్డి ఆధ్వర్యంలో మారిశెట్టి సత్యనారాయణ, మారిశెట్టి వీరపండు, అంబటి గణేశ్‌లు ఏర్పాట్లు చేశారు. అర్చకులు పెరవలి సత్యప్రసాద్, సాయి పూజలు నిర్వహించారు. గురుస్వామిరెడ్డి , అయ్యప్ప మాలధారులు మండపంలో అరటి డొప్పలపై కర్పూరం వెలిగించి పడి నిర్వహించారు, అనంతరం స్వాములకు ఒడి ఏర్పాటు చేశారు. సుమారు 50 మంది వరకు అయ్యప్ప మాలధారులు పూజల్లో పాల్గొన్నారు.

### ఎంఈఓలకు సన్మానం



ఎంఈఓలు గణేశ్, గురుమూర్తిలను సన్మానిస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి, పీఆర్‌టీయూ నాయకులు

నిడదవోలు రూరల్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ జిల్లాలో నిడదవోలు మండలాన్ని ప్రథమ స్థానంలో నిలిపిన ఎంఈఓలు కేవీగణేశ్, పి.గురుమూర్తి సేవలు అభినందనీయమని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం ఎంఈఓ కార్యాలయంలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓలు కేవీ గణేష్, పి.గురుమూర్తిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పి.రాజారావు, మండల శాఖ అధ్యక్షుడు సీహెచ్ఎస్ఆర్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సీహెచ్ అశోక్ గౌతమ్, ఉపాధ్యాయులు చెరుకు శ్రీనివాస్, ఐవీ రమణ, మట్టా సత్యనారాయణ, కేఎస్‌వీ రమేష్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

దేవరపల్లి: గుండుగొలను–కొవ్వూరు పాత జాతీయ రహదారిపై మండలంలోని కృష్ణంపాలెం వద్ద సోమవారం రాత్రి జరిగిన ప్రమాదంలో స్థానిక ఇందిరమ్మ కాలనీకి చెందిన కడిమి అంజిబాబు (40) అనే వ్యక్తి మృతి చెందాడు. బైక్‌పై వెళుతున్న అంజిబాబును వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. చిన్నాయగూడెంకు చెందిన అంజిబాబు దేవరపల్లి ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటూ ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు.మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. స్థానిక ఎస్సై వి. సుబ్రహమణ్యం ప్రమాద స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# స్నేహితులు .. సేవా వారధులు

- చిరంజీవి యువత పేరిట గ్రామాల్లో సేవలు
- మూడు వేల మందితో రక్తదానం

నల్లజర్ల: మండలంలోని తెలికిచెర్ల గ్రామానికి చెందిన రుద్రా శ్రీనివాస్ ఓ సామాన్యుడు. సినీ నటుడు చిరంజీవికి వీరాభిమాని. ఆయన స్ఫూర్తితో గ్రామంలో గత 24 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. అందుకు తెలికిచెర్ల గ్రామ యువతతో పాటు పరిసర గ్రామాల యువత సుమారు 100 మంది ఆయనకు అండగా నిలుస్తున్నారు. గ్రామంలోని రోగులను ఆసుపత్రులకు తీసుకెళ్లి వైద్యం చేయిస్తారు. అక్కడ రోగులకు రక్తం అవసరమైనపుడు మాత్రం చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్య పరిష్కారానికి రుద్రా శ్రీనివాస్ స్వచ్ఛందంగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తూ రెడ్‌క్రాస్ సంస్థకు యువకులతో రక్తదానం చేయిస్తున్నారు. ఇలా ఇప్పటి వరకూ దాదాపు 3 వేల మందితో రక్తదానం చేయించారు. యూత్ సభ్యులు ముందుగా గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేసి రక్తదాన ఆసక్తిపరుల బ్లడ్ గ్రూపులు పరీక్ష చేయించి తమ వద్ద సిద్ధంగా ఉంచుకుంటారు. పట్టణ ప్రాంతంలో సైతం కీలక రక్తగ్రూపులు అవసరమైనపుడు ఆయా గ్రూపు సభ్యులను అక్కడికి తీసుకెళ్లి రక్తందానం చేయిస్తుంటారు. యూత్ సభ్యులు తాము సంపాదించిన సొమ్ములో కొంత మొత్తాన్ని కుటుంబ ఖర్చులకు, మిగతాది ఈ సంస్థ అభివృద్ధికి ఖర్చు చేస్తున్నారు. బంధువులు, మిత్రులు, గ్రామస్తులు, పరిచయస్తుల నుంచి మరి కొంత మొత్తాన్ని సేకరిస్తున్నారు. ఈ మొత్తంతో ఆపదలో ఉన్నవారికి పెద్దల చేతుల మీదుగా నగదు అందజేస్తూ అండగా నిలుస్తున్నారు. ఒక వికలాంగ యువకుడికి బ్యాటరీ వాహనం అందజేశారు.

**రక్తదానంతో ఆదర్శంగా..**

రక్తదానం ప్రాణ దానంతో సమానమని నమ్మిన చిరంజీవి యూత్ సభ్యులు ఆ దిశగా అడుగులు వేశారు. చాలా సందర్భాల్లో రక్తం లభించక ఇబ్బందులు పడుతున్న వారిని చూసి తాము చేయవలసింది ఇదికాదు అని తెలుసుకుని రక్తదానం దిశగా అడుగులు వేశారు. ముందుగా బ్లడ్ గ్రూపులు నిర్ధారించే కార్యక్రమం చేపట్టి దాదాపు 1200 మంది నుంచి బ్లడ్ గ్రూపులు సేకరించారు. ప్రతి గ్రామంలో ఒక సభ్యుడ్ని ఎంపిక చేసి అత్యవసర సందర్భాల్లో ఎవరికైనా రక్తం అవసరమైతే ఆ గ్రూపువారిని తీసుకొని సంబంధిత ఆసుపత్రికి వెళ్లి నేరుగా రక్తం అందించే విధంగా ఏర్పాటు చేస్తున్నారు.

అంతేగాకుండా అభాగ్యులు, వృద్ధులు, నిరుపేదలకు యూత్ బృందం అండగా నిలుస్తోంది. కరోనా కష్టకాలంలో ఎంతోమందికి ఆహార పొట్లాలు అందించింది. దీంతో పాటు కరోనా బాధితులకు ఆక్సిజన్ సిలిండర్లు అందించారు.ఈ కార్యక్రమాలతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రధాన వీధులు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద వన మహోత్సవాలు నిర్వహిస్తున్నారు.



శిబిరంలో రక్తదానం చేస్తున్న యూత్ సభ్యులు



వికలాంగుడికి బ్యాటరీ వాహనం సమకూర్చిన యూత్ సభ్యులు(ఫైల్)

### సాటి మనిషిని కాపాడాలనే..



వివిధ సందర్భాల్లో అవసరమైన రక్తం లభించక ఇబ్బందులు పడుతున్న వారి బాధ వర్ణనాతీతం. సంపన్నులైతే ఏదో విధంగా అవసరమైన రక్తాన్ని కొనుక్కోగలుగుతారు. మరి పేదల పరిస్థితి?. అలాంటి పేదల కష్టాలు తీర్చడంలో కొంతమేరకైనా సహాయ పడితే మేం అనుకున్న లక్ష్యం సాధించినట్టుగానే భావిస్తున్నాం.

–రుద్రా శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు, తెలికిచెర్ల

### గురువుల మాటలే స్ఫూర్తి



పాఠశాల్లో చదువుకునే రోజుల్లో తోటివారికి సాయపడమని గురువులు చెప్పేవారు. దానినే స్ఫూర్తిగా తీసుకొని ఈ యూత్ సంస్థ ప్రారంభించాం. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ శిబిరాలు నిర్వహించి బ్లడ్ గ్రూపులు సేకరించాం. సమీప పట్టణాల ఆసుపత్రుల వారు ఫలానా రోగికి ఫలానా గ్రూపు బ్లడ్ అవసరమని కోరగానే ఆ గ్రూపు బ్లడ్ ఉన్నవారు ఎక్కడ ఉన్నా వారిని కాంటాక్ట్ చేసి సకాలంలో ఆ రోగికి నేరుగా రక్తం అందించే ఏర్పాటు చేస్తున్నాం.

–ఆచంట రమేష్, యూత్ సభ్యుడు, తెలికిచెర్ల

### చాగల్లు శివాలయంలో తాచుపాము



చాగల్లు శివాలయం ఆలయ ప్రాంగణంలో పాము

చాగల్లు: కార్తిక సోమవారం నాడు చాగల్లు శివాలయంలో తాచుపాము దర్శనమిచ్చింది. శివలింగానికి అభిషేకం చేసేందుకు తెల్లవారుజామునే అర్చకుడు శివసీతారామశాస్త్రి ఆలయ ముఖద్వారాలు తెరిచారు. శివలింగంపై నాగుపాము పడగ విప్పి ఆయనకు దర్శనం ఇచ్చింది. ఆయన భక్తి పారవశ్యంతో స్వామివారిని మొక్కుకున్నారు. పాము ఉన్నంతసేపు ఆయన ఆలయ ముఖద్వారం వద్ద వేచి ఉండి, మంత్రోచ్ఛరణలతో స్వామివారిని కొలిచారు. కొద్దిసేపటి తర్వాత పాము మెల్లగా ఆలయ ప్రాంగణంలోని పాము పడగల విగ్రహం వద్దకు చేరుకుని, అక్కడ కూడా పడగ విప్పి దర్శనం ఇచ్చింది. ఈ విషయం తెలుసుకున్న భక్తులు సాక్షాత్తూ ఆ పరమశివుడే శివాలయానికి వేంచేశారంటూ ఉదయం నుంచి పెద్ద ఎత్తున ఆలయానికి వచ్చి, పూజలు నిర్వహించారు.

### సీయోను ప్రార్థన మందిరానికి ప్రతిష్ఠాపన

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెంలో సీయోను నూతన ప్రార్థనా మందిరం మూలరాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ ముఖ్యఅతిథిగా హాజరై నూతన ప్రార్థన మందిరం నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు రెవరెండ్ పి.ఓబెద్యా, పాస్టర్ పి.కోర్నిలియస్, మండల పాస్టర్లు, స్థానిక విశ్వాసులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో దుద్దుకూరుకు పతకాలు



రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో స్వర్ణ, వెండి పతకాలు సాధించిన దుద్దుకూరు విద్యార్థినులు వర్షిత పావని, జింగ్‌లాగి



స్వర్ణపతకం సాధించిన అర్మిత భవాని చౌదరి

- వర్షిత పావనికి స్వర్ణ, జింగ్‌లాగికి రజత పతకాలు
- జాతీయ పోటీలకు ఎంపికైన వర్షిత పావని

దేవరపల్లి: రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో మండలంలోని దుద్దుకూరు రంగరాయ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినులు సత్తా చాటారు. ఈ నెల 2,3 తేదీల్లో నెల్లూరులో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్– 17 బాలికల విభాగం యోగా పోటీల్లో ఈ హైస్కూల్ విద్యార్థినులు మిద్దే వర్షిత పావని, పఠాన్ జింగ్‌లాగి పాల్గొన సత్తా చాటారు. ఆర్టిస్టిక్ యోగా పోటీల్లో మిద్దే వర్షిత పావని ప్రథమ స్థానంలో నిలిచి, స్వర్ణ పతకం సాధించగా, టీమ్ ఛాంపియన్ షిప్‌లో పఠాన్ జింగ్‌లాగి ద్వితీయస్థానం సాధించి సిల్వర్ పతకం గెలుచుకుందని ప్రధానోపాధ్యాయురాలు జీఏ స్వర్ణకుమారి, పీడీ కె.అరుణ్‌కుమార్ సోమవారం తెలిపారు.కాగా వర్షిత పావని జాతీయ పోటీలకు ఎంపికై నట్టు చెప్పారు. ఇద్దరు విద్యార్థినులను హెచ్ఎం స్వర్ణకుమారి, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ కె.రామతులసి, పీఈటీ అరుణ్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

**యోగాలో అర్మిత భవాని చౌదరికి స్వర్ణపతకం**

రాష్ట్ర స్థాయి యోగా పోటీల అండర్ –17 విభాగంలో దేవరపల్లి మండలం చిన్నాయగూడెంకు చెందిన విద్యార్థిని ఇమ్మణి అర్మిత భవాని చౌదరి స్వర్ణ పతకం సాధించింది. ఈ నెల 2,3 తేదీల్లో నెల్లూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో అర్మిత భవాని చౌదరి జిల్లా జట్టులో ఆడి టీమ్ ఛాంపియన్‌లో స్వర్ణ పతకం సాధించింది. మహారాష్ట్రలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో ఆమె పాల్గొంటుందని తల్లిదండ్రులు తెలిపారు.

**రాష్ట్రస్థాయి పోటీలకు చిక్కాల విద్యార్థులు..**

చాగల్లు: వివిధ విభాగాల్లో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు చిక్కాల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు నలుగురు ఎంపికైనట్టు హెచ్ఎం ఎం.నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. ఇటీవల నిర్వహించిన స్కూల్ గేమ్స్ జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో సత్తా చాటడంతో వారిని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టుకు ఎంపిక చేశారు.

అండర్– 17 జావెలిన్ త్రో విభాగంలో జిల్లాస్థాయిలో ప్రథమస్థానం సాధించిన ఎస్.దుర్గాప్రసాద్ విజయనగరంలో ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకూ నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నాడు. అలాగే అండర్–14 డిస్కస్ త్రోలో పి.లక్ష్మీ ప్రసన్న, అండర్–17 బాలుర విభాగంలో పాలపర్తి రేష్మంత్ బాల్‌బాడ్మింటన్ పోటీలకు, అండర్–17 క్రికెట్ బాలికల విభాగంలో నాగ శైలజ రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు.

## ‘ఉపాధి’ కల్పించాలంటూ కూలీల ఆందోళన



నల్లజర్ల మండల పరిషత్ ఆఫీసు ఎదుట ఆందోళన చేస్తున్న అచ్చన్నపాలెం ఉపాధికూలీలు

నల్లజర్ల: ఉపాధి హామీ పనులు లేకపోవడంతో మండలంలోని అచ్చన్నపాలెం గ్రామంలో కూలీలందరూ నాలుగు రోజులుగా ఖాళీగా ఉంటున్నారు. గతంలో కేటాయించిన పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. గ్రామసభ ద్వారా కొత్తగా గుర్తించిన పనులకు అచ్చన్నపాలెం సర్పంచ్ తీర్మానాలు ఇవ్వనందున పనులు లేకుండా పోయాయంటూ కూలీలు సోమవారం ఎంపీడీఓ సింహాద్రికి ఫిర్యాదు చేశారు. అంతకు ముందు వారు స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట కొద్దిసేపు ఆందోళన చేశారు. దాదాపు 110 మంది కూలీలకు ఇటు వ్యవసాయ పనులు గాని, అటు ఉపాధి హామీ పనులు గాని లేకుండా పోయాయని వారు తెలిపారు. దీనిపై ఎంపీడీఓ సింహాద్రి మాట్లాడుతూ గ్రామ పంచాయతీకి వెళ్లి విచారణ చేపట్టాలని ఏపీఓ వెంకట్రావును ఆదేశించారు. వేతనదారులకు తగు న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# శంభో.. శివ శంభో

- శైవ క్షేత్రాల్లో తొలి కార్తిక సోమవారం పూజలు
- ముక్కంటికి విశేష పూజలు, అభిషేకాలు
- కార్తిక దీపాలు వదిలిన మహిళలు



నిడదవోలు గోలింగేశ్వరస్వామి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు



అన్నవరప్పాడు కోనేరులో కార్తిక దీపాలు వదులుతున్న మహిళలు



నిడదవోలు మండలం కాటకోటేశ్వరం శివాలయం వద్ద అన్న సమారాధన

నిడదవోలు: కార్తిక మాసంలోని మొదటి సోమవారం కావడంతో శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు ముక్కంటికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పట్టణంలో పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ ఒడ్డునే గల చినకాశి రేవులో వేకువజామున గంగ స్నానాలు ఆచరించిన భక్తులు శైవ క్షేత్రాలకు చేరుకుని విశేష పూజలు చేశారు. స్థానిక పురాతన రాజరాజేశ్వరీ సమేత గోలింగేశ్వరస్వామి, సోమేశ్వరస్వామి వార్ల ఆలయాల్లో భక్తులు నిత్యాభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య భక్తులు ఆకాశదీపం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓలు సోమాల శివ, నామా సూర్యప్రకాశ్, అర్చకులు శ్రీకాకుళపు వెంకటేశ్వరరావు, శ్రీకాకుళపు లక్ష్మీనరసింహస్వామి తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: కార్తిక మాసంలోని తొలి సోమవారాన్ని పురస్కరించుకుని మండలంలోని శైవ క్షేత్రాల్లో భక్తులు తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. సమిశ్రగూడెంలోని శ్రీపర్వత వర్ధిని ఉమారామలింగేశ్వరస్వామి, కాటకోటేశ్వరంలోని ఉమా కాటకూటేశ్వర లింగేశ్వరస్వామి, కంసాలిపాలెం అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి శివ పంచాయతన ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కాట కోటేశ్వరంలోని శివాలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించగా నాలుగు వేల మంది భక్తులు స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

చాగల్లు: మండలంలోని శివాలయాలకు తెల్లవారుజాము నుంచి భక్తులు పోటెత్తారు. చాగల్లు రాజరాజేశ్వరీ స్వామి, బ్రాహ్మణగూడెం బాలరామలింగేశ్వర స్వామి, చిక్కాల, కలవలపల్లి, ఊనగట్ల, మార్కొండపాడు ఉమామార్కండేయ స్వామి వార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తాళ్లపూడి: అధిక సంఖ్యలో మహిళలు తెల్లవారుజామునే గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేగేశ్వరపురంలోని ఛాయా సోమేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు ధనుంజయ్ ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించారు. అలాగే తాళ్లపూడిలోని ఉమా మహేశ్వరస్వామి గుడిలోను, ప్రక్కిలంకలోని పార్వతీ సహిత విశ్వేశ్వర స్వామి ఆలయంలోనూ ఏకాదశి రుద్రాభిషేకాలు, అభిషేకాలు చేశారు. స్వామి వారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అన్నదేవరపేట సంగమేశ్వరస్వామి ఆలయంలోను ప్రత్యేక పూజలు నిర్వహించారు. బల్లిపాడు, పెద్దేవం, మలకపల్లి ఆలయాల్లోనూ శివునికి అభిషేకాలు చేశారు.

పెరవలి: మల్లేశ్వరం గ్రామంలోని స్వయంభూ కపిల మల్లేశ్వరస్వామి ఆలయంలో అధిక సంఖ్యలో మహిళలు స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి, తడి దుస్తులతో అభిషేకాల్లో పాల్గొన్నారు. అన్నవరప్పాడులోని ఉమా విశ్వేశ్వరస్వామి, ఖండవల్లిలోని మార్కండేయ మృఖండేయ స్వామివారి ఆలయాల్లోను, ముక్కామలలోని ఉమా సోమేశ్వరస్వామి ఆలయంలోను, కాపవరంలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలోను, తీపర్రులోని రాజరాజనరేంద్ర స్వామి ఆలయంలోను భక్తులు అధిక సంఖ్యలో అభిషేకాలు నిర్వహించారు. అర్ధరాత్రి ఒంటి గంటకు ప్రారంభమైన అభిషేకాలు ఉదయం 10 గంటల వరకూ నిర్విఘ్నంగా కొనసాగాయి. మహిళలు కార్తిక దీపాలు వదిలారు.

ఉండ్రాజవరం: కె.సావరం గ్రామంలోని దుర్గామల్లేశ్వర స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం, అమ్మవారికి సహస్ర నామ కుంకుమ పూజలు నిర్వహించారు. పాలంగిలోని రామలింగ్వేర స్వామి, మోర్తలోని శివాలయంలో ఉదయం నుంచి స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఆలయ ధ్వజ స్తంభం వద్ద దీపారాధనలు చేశారు. శివాలయంలోని ఉసిరి చెట్టుకు వారు పూజలు చేసారు. ఆనంతరం ప్రసాద వితరణ చేసారు.



చాగల్లులో శివాలయంలో స్వామి వారు



ప్రక్కిలంక శివాలయంలో పూల అలంకారం



పెరవలి మండలం మల్లేశ్వరంలో కపిల మల్లేశ్వరస్వామి



ఉండ్రాజవరం మండలం కె.సావరంలో దుర్గా మల్లేశ్వర స్వామి

### సొసైటీ వద్ద పెట్రోల్ బంక్ ప్రారంభం

దేవరపల్లి: యర్నగూడెంలో సొసైటీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బీపీసీఎల్ పెట్రోల్, డీజిల్ బంకును సోమవారం గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ప్రారంభించారు. సుమారు 12 ఏళ్ల క్రితం సొసైటీ వద్ద కన్స్యూమర్ డీజిల్ బంకు ఏర్పాటు చేసి రైతులకు సరఫరా చేసేవారు. కన్స్యూమర్ బంకు కావడం వల్ల రేటు ఎక్కువగా ఉండడంతో ఏడాది క్రితం బంకును మూసి వేశారు. అనంతరం డీజిల్, పెట్రోల్ రిటైల్ బంకు మంజూరు కావడంతో బంకును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం సొసైటీ వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.

### వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే ముప్పిడి

చాగల్లు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. గత ప్రభుత్వంలో నిర్మించిన సచివాలయ భవనాలు, ఇతర పనులకు బిల్లులు మంజూరు చేయాలని ఒక కాంట్రాక్టర్ వినతిపత్రం అందజేశారు. చిక్కాల శివారు పొలాల్లో కొండ చిలువలు, రక్త పొడలు వంటి విష సర్పాలు తిరుగుతున్నాయని కలవలపల్లికి చెందిన ముళ్లపూడి అప్పారావు ఫిర్యాదు చేశారు. వాటిని పట్టుకుని అడవిలో విడిచి పెట్టేలా అటవీ శాఖ సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. నిడదవోలు– పంగిడి రోడ్డు మరమ్మతులు చేపట్టాలంటూ పలువురు కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.మెరికమ్మ, ఎంపీడీవో శ్రీదేవి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# మార్మోగిన హరినామ సంకీర్తన

- గోష్పాద క్షేత్రంలో కన్నుల పండువగా గోదావరి హారతి
- వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు పూజలు
- వేలాదిగా తరలి వచ్చిన భక్తులు

కొవ్వూరు: హరినామ సంకీర్తనలతో స్థానిక గోష్పాద క్షేత్రం మార్మోగింది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) దాస సాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఈ క్షేత్రంలో గోదావరి హారతి వేడుకను కన్నుల పండువగా నిర్వహించారు. గోదావరి నదిపై పంటు మీద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అందమైన వేదికపై తిరుమల నుంచి తీసుకువచ్చిన వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్ట్ విశేషాధికారి పీఆర్ ఆనంద తీర్థాచార్యులు మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోని ప్రతి పూజలోనూ గోదావరి నదికి ‘దక్షిణ తీరే’ అని సంబోధిస్తే, రాజమహేంద్రవరం అవతలి వైపు వారు ‘ఉత్తర తీరే’ అంటూ స్మరించుకుంటారన్నారు. ఉత్తర భారత దేశంలో గంగానదికి ఎంతో ప్రాధాన్యం ఉండగా, దక్షిణ భారతంలో వృద్ధ గంగగా పిలిచే గోదావరికి కూడా అంతే ప్రాముఖ్యత ఉందన్నారు. మానవాళికే కాకుండా సకల జీవరాశులకు గోదావరి నీరు జీవనాధారం అయ్యిందన్నారు. గోదావరిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. గోదావరి పవిత్రత, గోష్పాద క్షేత్రం విశిష్టత గురించి పురాణాల్లో ఉన్నందునే 16 ఏళ్లుగా ఈ క్షేత్రంలో గోదావరి హారతి నిర్వహిస్తున్నామన్నారు. కార్తిక మాసంలో దీపారాధన చేయడం ద్వారా మన అంతరంగంలోని అజ్ఞానం అనే చీకట్లు తొలగిపోతాయన్నారు. కార్తిక మాస విశిష్టత, గోదావరి నది ప్రాముఖ్యత గురించి ఆయన వివరించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గోదావరి పుట్టుకకు కారణమైన పవిత్ర కొవ్వూరు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించడం తన పూర్వ జన్మ సుకృతం అన్నారు. అనంతరం టీటీడీ నుంచి వచ్చిన వేద పండితులు వేద మంత్రోచ్ఛరణల మధ్య గోదావరి నదికి వివిధ రకాల హారతులు సమర్పించారు. నదీమ తల్లికి చీర, పసుపు, కుంకుమలు సమర్పించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మునిసిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, ప్రముఖ పండితుడు దోర్బల ప్రభాకర శర్మ, పలువురు రాజకీయ, ఆధ్యాత్మికవేత్తలు, వేలాదిగా భక్తులు హాజరయ్యారు.



గోదావరి నదికి హారతి సమర్పిస్తున్న టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు విశేషాధికారి ఆనంద తీర్థాచార్యులు, టీటీడీ పండితులు



గోష్పాద క్షేత్రంలో గోదావరి హారతిని తిలకించేందుకు తరలివచ్చిన భక్తజనం